మహా జాతర
మన జాతర - మన మేడారం
నమస్తే తెలంగాణ
శుక్రవారం 23 ఫిబ్రవరి 2024 వరంగల్
ప్రత్యేక అనుబంధం - IV





దర్శనం కోసం గద్దెల వద్దకు వస్తున్న భక్తులు





# తల్లీ మిము తలంచి..

## వీర మాతలకు జన జేజేలు

### గద్దెలపై ఆసీనులైన సమ్మక్క-సారలమ్మ

- మొక్కులు తీర్చేందుకు చీమలదండులా తరలివస్తున్న భక్తులు
- జన సాగరంలా జంపన్నవాగు
- కిక్కిరిసిన మేడారం పరిసరాలు
- కిటకిటలాడుతున్న రహదారులు, జోడు వంతెనలు
- భక్తులను ఆశీర్వదిస్తున్న అమ్మవార్లు



సమ్మక్కరాక సందర్భంగా చిలుకలగుట్ట వద్ద గాల్లోకి కాల్పులు జరుపుతున్న ఎస్పీ శబరీష్



ఏదారి చూసినా ఇసుక పోస్తే రాలనంత జనం..
ఏదిక్కు చూసినా కనుచూపుకందని గుడారాల సమాహారం..
ఏ చెట్టు చూసినా.. ఏ పుట్ట చూసినా వెదజల్లే ఆధ్యాత్మిక పరిమళం..
ఎవరిని తట్టినా అమ్మవార్లపైనే పరధ్యానం..
ఏదో అంతుపట్టని ఆవాహనం.. అంతులేని పారవశ్యం.. అవధుల్లేని ఆనందం..
వీరగడ్డ మేడారంలో నిదీ అనుభూతి పర్వం..

దేశ నలుమూలల నుంచీ పోటెత్తుతున్న భక్తులతో మేడారంలో జన విస్ఫోటనం కనిపిస్తున్నది. తల్లుల ధ్యాసలో లీనమై తరలివస్తున్న కోట్లాది మందికి వనమాత విడిది ఇస్తున్నది. చీమలదండులా వచ్చి పుణ్యస్నానాలు చేస్తున్న వారితో సంపెంగవాగు జనసాగరమవుతున్నది. బుధవారం రాత్రి కన్నెపల్లి నుంచి బిడ్డ సారలమ్మ, గురువారం రాత్రి చిలుకల గుట్ట నుంచి తల్లి సమ్మక్క వచ్చి మేడారంలో గద్దెలపై ఆసీనులు కాగా మొక్కులు చెల్లించేందుకు భక్తులు ఎగబడుతున్నారు. పసుపు కుంకుమలు, గాజులు, కంకబియ్యం (ఒడిబియ్యం), ఎత్తుబంగారం, ఎదురుకోళ్లు, లక్ష్మీదేవర, ఊయల కట్టడం, కోళ్లు, మేకల బలి.. ఇలా తీరొక్క మొక్కులతో తల్లులను ప్రసన్నం చేసుకుంటున్నారు. పిల్లాపాపలను.. గొడ్డుగోదను.. ఎవుసాన్ని సల్లంగ సూడాలని మనసారా మొక్కుకుంటున్నారు. సకుటుంబ సపరివార సమేతంగా వచ్చి.. కనిపించిన ప్రతి చెట్టు, పుట్టలో తల్లులను చూసుకుంటూ ప్రత్యేక పూజలు చేస్తూ ఆధ్యాత్మిక భావాన్ని ఇనుమడింపజేస్తున్నారు. అమ్మవార్ల ధ్యానంలో పూనకాలతో శివాలూగుతూ ఆడబిడ్డలు సమక్క-సారలమ్మలకు ప్రతిరూపాలుగా మారుతున్నారు. గుండెల నిండా భక్తితో తల్లీబిడ్డలకు ప్రణమిల్లి.. మళ్లొచ్చే జాతరకు మళ్లీవస్తామంటూ ఆనందంగా తిరుగుపయనమవుతున్నారు. భక్తులు వచ్చినప్పటి నుంచి క్షేమంగా వెళ్లేదాకా ఇటు పోలీసులు, అటు అధికారులు విధుల్లో తలమునకలై ప్రజాసేవలో తరిస్తున్నారు.



భక్తులతో కిక్కిరిసిన గద్దెల ప్రాంగణం